## క్లుప్తంగా

### క్రీడాకారులకు శిక్షణ



**పొదలకూరు:** మండలంలోని అంకుపల్లి గ్రామంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులు శిక్షణ ఇచ్చారు. మంగళవారం ముగింపు సందర్భంగా ఆ అసోసియేషన్ బాధ్యులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంపికైన వారిలో అంకుపల్లికి చెందిన కొప్పల విఘ్నేష్, కొప్పల యశ్వంత్, టి.పెంచలయ్య, పల్లిపాడుకు చెందిన భానుచందర్, ప్రవీణ్, హేమకల్యాణ్, వర్షిత్, గూడూరుకు చెందిన కార్తీక్, నాయుడుపేటకు చెందిన సంజయ్, అమంచర్లకు చెందిన నందకిషోర్ ఉన్నారు. కార్యక్రమంలో బాధ్యులు శశిధర్, కె.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### అప్రమత్తంగా ఉండాలి



యువకులతో మాట్లాడుతున్న సీఐ

**మనుబోలు:** వినాయకచవితి వేడుకల సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సీఐ శివరామకృష్ణారెడ్డి సూచించారు. మనుబోలు బీసీ కాలనీలో ఏర్పాటు చేసి వినాయక మండపాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ గతేడాది జరిగిన బాణసంచా పేలుళ్లలో బాలుడు మృతి చెందగా పలువురు తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీఐ నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. విద్యుద్దీపాల అలంకరణ, బాణసంచా విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

### రావిఆకుపై గణనాథుడు



రావిఆకుపై..

**మనుబోలు:** వినాయకచవితిని పురస్కరించుకుని మండలంలోని వీరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పని చేస్తున్న సూక్ష్మ చిత్రకారుడు సోమా పద్మారత్నం మంగళవారం రావిఆకుపై గణనాథుని చిత్రాన్ని రూపొందించారు. అలాగే మనుబోలు పంచాయతీ పరిధిలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము క్యాండిల్‌ను వినాయకుని రూపంలో చెక్కారు.

### ప్రాథమిక దశలోనే కుష్టును గుర్తించాలి



మాట్లాడుతున్న ఖాదర్‌వలీ

**నెల్లూరు(అర్బన్):** ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధిని గుర్తిస్తే తగు చికిత్స చేయడం ద్వారా నయం చేసి అంగవైకల్యం రాకుండా కాపాడొచ్చని జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలీ పేర్కొన్నారు. కుష్టు నియంత్రణ చర్యలపై సెక్టార్ వారీగా జిల్లా వైద్య శాఖ కార్యాలయంలోని తన చాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ఈ నెల్లో కొత్తగా నమోదైన కేసులపై ఆరాతీశారు. అవసరమైన వారికి ఎమ్సీఆర్ చెప్పులు, కొబ్బరి నూనె, టవళ్లు తదితరాలను అందజేయాలని కోరారు.

### యూపీహెచ్‌సీలో తనిఖీ



**నెల్లూరు(అర్బన్):** నగరంలోని చాకలివీధిలో గల పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా నివారణాధికారి హుస్సేనమ్మ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ, చికున్ గున్యా తదితర కేసుల వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి ల్యాబ్ టెక్నీషియన్లతో మాట్లాడారు. రక్త పరీక్షలను వేగంగా, నాణ్యవంతంగా చేపట్టాలని సూచించారు. అనంతరం రాయాజీవీధిలో చేపట్టిన లార్వా సర్వేను తనిఖీ చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్ర కో ఆర్డినేటర్ తిరుపతయ్య, హెల్త్ అసిస్టెంట్ పెద్దయ్య, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి నజీరా తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం మండలంలో..



మనుబోలు : వినాయకుడి విగ్రహం



మనుబోలు : విద్యుద్దీపాల వెలుగులో వీధి

# జైజై గణేశా..

**పొదలకూరు:** గ్రామాలు, పట్టణాల్లో వినాయకచవితి సందడి నెలకొంది. బుధవారం పండగ సందర్భంగా యువకులు పెద్ద ఎత్తున విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం పట్టణంలోని తయారీదారుల వద్దకు చేరుకుని విగ్రహాలను గ్రామీణ ప్రాంతాలకు తరలించారు. చుట్టుపక్కల మండలాలైన రాపూరు, మనుబోలు, చేజర్ల మండలాలకు చెందిన యువకులు కూడా పెద్దఎత్తున వచ్చారు.

➡ **తోటపల్లిగూడూరు:** వినాయకచవితి వేడుకలకు పల్లెలు సిద్ధమయ్యాయి. అనేకచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉత్సవాలు మూడు నుంచి 11 రోజులపాటు అత్యంత వైభవంగా జరుగుతాయి. మంగళవారం ఉదయం నుంచి నరుకూరు సెంటర్‌లోని వినాయక బొమ్మల తయారీ కేంద్రాల వద్ద కొనుగోలుదారుల హడావుడి కనిపించింది. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు పండగను జరుపుకొనేందుకు స్వగ్రామాలకు చేరుకున్నారు.

➡ **వెంకటాచలం:** వినాయకచవితి సందర్భంగా ఉత్సవాలను నిర్వహించేందుకు పల్లెల్లో ఏర్పాట్లు చేశారు. 5 నుంచి 14 అడుగుల ఎత్తు గల విగ్రహాలను కొనుగోలు చేశారు. మండల కేంద్రమైన వెంకటాచలం, కసుమూరు, సర్వేపల్లి, గొలగముడి, అనికేపల్లి, కాకుటూరు, తిక్కవరప్పాడు, నిడిగుంటపాళెం తదితర గ్రామాల్లో ప్రతి కాలనీలో వేడుకలు నిర్వహిస్తున్నారు.

➡ **మనుబోలు:** మండల కేంద్రంలోని పిడూరు రోడ్డులో సుమారు 15 అడుగుల వినాయకుడి విగ్రహాన్ని మంగళవారం ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల కటౌట్లను పెట్టారు. మనుబోలులోని వివిధ కూడళ్లలో 20కి పైగా, మండల వ్యాప్తంగా 100కు పైగా విగ్రహాలను వివిధ గ్రామాల్లో పెట్టారు.



పొదలకూరు: క్రేన్‌తో విగ్రహాన్ని ట్రాక్టర్ ట్రక్కులో పెడుతూ..

**సందడి షురూ..**

**కోవూరు:** వినాయక చవితి పర్వదినానికి సర్వం సిద్ధమైంది. భారీ విగ్రహాలను ఏర్పాటు చేసే పనిలో పలువురు నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలో దాదాపు రెండు వేలకుపైగా పందిళ్లను ఏర్పాటు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో రూపొందించే విగ్రహాల స్థానంలో మట్టి వినాయక ప్రతిమలవైపు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. ఎలాంటి అపశ్రుతులు జరగకుండా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు పలువురు పంపిణీ చేస్తున్నారు.



నరుకూరు సెంటర్‌లో సిద్ధంగా బుజ్జి గణపయ్యలు

**పర్యావరణాన్ని కాపాడదాం**

వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలి. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుంది. పండగను ఆనందంగా జరుపుకోవాలి.

– సుబ్బయ్య, తహసీల్దార్

**అనుమతులు తప్పనిసరి**

వినాయక చవితి సందర్భంగా పందిళ్ల ఏర్పాటుకు అనుమతులను విధిగా పొందాలి. నిబంధనల మేరకే ఉత్సవాలను నిర్వహించాలి. సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేయాలి. అశ్లీల కార్యక్రమాలను చేపడితే చర్యలు తప్పవు.

– రంగనాథ్‌గౌడ్, ఎస్సై



### విఘ్నేశ్వరుడి ఆశీస్సులు అందరిపై ఉండాలి



ప్రసన్నకుమార్‌రెడ్డి

**కోవూరు:** విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కాంక్షించారు. ఈ మేరకు వినాయక చవితి శుభాకాంక్షలను తెలియజేశారు.

### వినాయక చవితి సంబరాలు



**విడవలూరు:** స్థానిక పీఆర్ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వినాయక చవితి వేడుకలను ప్రిన్సిపల్ సుజాత ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. ప్రిన్సిపల్ మధు తదితరులు పాల్గొన్నారు.

### రామన్నపాళెంలో 'పొలం పిలుస్తోంది'



**కొడవలూరు:** సీసీఆర్ కార్డులను పొందడం ద్వారా కౌలు రైతులకు ప్రభుత్వ గుర్తింపు లభిస్తుందని ఏఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని రామన్నపాళెం, ఆలూరుపాడులో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కౌలు రైతులకూ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన తరుణంలో సీసీఆర్ కార్డులను విధిగా పొందాలని సూచించారు. పంట నమోదు చేసుకోవాలని కోరారు. వీఏఏలు నిహారిక, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

## కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసిన నాయకులు

**మనుబోలు:** మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజితను మనుబోలు మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం కలిశారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఈ సందర్భంగా కాకాణి వారికి సూచించారు. కార్యక్రమంలో బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ముంగర రవీందర్‌రెడ్డి, సూరపనేని కిశోర్ నాయుడు, దాసరి భాస్కర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వరికి మద్దతు ధర కల్పించాలి

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** వరికి మద్దతు ధరను కల్పించాలని కౌలు రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ముత్యాల గురునాథం కోరారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. పుట్టికి రూ.20 వేల మద్దతు ధరను కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా, రూ.15 వేలకే మిల్లర్లు కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. మరో 15 రోజుల్లో వరి కోతలు ముమ్మరంగా జరిగే అవకాశం ఉందని, అప్పుడు ఇంకా తక్కువకు కొనుగోలు చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై కలెక్టరేట్ ఎదుట నిరసనను ఈ నెల 29న చేపట్టనున్నామని చెప్పారు. సురేష్, లక్ష్మయ్య, మౌలయ్య, మాధవయ్య, మల్లికార్జున, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గురునాథం

## ఆరాధనోత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

**తోటపల్లిగూడూరు:** కోడూరు వేళాంగణి చర్చిలో జరుగనున్న ఆరాధనోత్సవాలకు సంబంధించి మంగళవారం డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద కోడూరు వేళాంగణిమాత పుణ్యక్షేత్రానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఈనెల 29వ తేదీ నుంచి ఆరాధనోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సెప్టెంబర్ 6, 7, 8 తేదీల్లో మూడురోజులపాటు వేళాంగణిమాత జన్మదిన వేడుకలను అత్యంత వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉచిత అన్నదానం, భక్తుల రాకపోకలకు నెల్లూరు నుంచి ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.



## కేజ్ వీల్స్‌తో రోడ్లు తుక్కుతుక్కు



తారురోడ్డుపై తరలిస్తున్న కేజ్ వీల్స్ (ఫైల్)



దెబ్బతిన్న తారురోడ్డు

**– పట్టించుకోని అధికారులు**

**పొదలకూరు:** ప్రభుత్వాలు ప్రజాధనంతో రూ.కోట్లు వెచ్చించి నిర్మిస్తున్న రహదారులు కొందరి నిర్లక్ష్యం వల్ల దెబ్బతింటున్నాయి. తిరిగి మరమ్మతులు చేసేందుకు సమయం పడుతుండటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వరినాట్ల కోసం రైతులు మాగాణి భూములను కేజ్ వీల్స్‌తో తొక్కిస్తుంటారు. అయితే వాటిని ట్రాక్టర్ ట్రక్‌లో తీసుకెళ్లాలి. పొలాల్లో దింపి సేద్యం పనులు పూర్తయిన తర్వాత అలాగే తరలించాలి. అయితే కొందరు ఇష్టానుసారంగా ఇళ్ల వద్ద నుంచి ఇనుప చక్రాలను ట్రాక్టర్ ఇంజిన్లకే తగిలించుకుని తారురోడ్లపై పొలాలకు తీసుకెళ్తున్నారు. వాటి బరువు, ఒత్తిడి వల్ల రోడ్లు కంకర తేలిపోతున్నాయి. క్రమంగా గుంతలు పడి ప్రయాణించేందుకు వీలులేనంతగా తయారవుతున్నాయి. దీనికి వర్షాలు తోడవుతుండటం బాగా దెబ్బతింటున్నాయి. కేజ్ వీల్స్‌ను రోడ్లపై తిప్పకూడదనే నిబంధనలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

**స్వయం నియంత్రణ అవసరం**

రైతులు స్వయం నియంత్రణ పాటించి ప్రజల ఆస్తి అయిన రోడ్లను కాపాడుకోవాల్సి ఉంది. రూ.కోట్లు వెచ్చించి రహదారులు నిర్మిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల పాడైపోతున్నాయి. నిబంధనలు పాటించి వీల్స్‌ను ట్రాక్టర్లలో తరలిస్తే నష్టాన్ని చాలావరకు నివారించవచ్చు. ఇందుకోసం రైతులు పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం కూడా ఉండదు. అధికారులు అవగాహన పెంపొందిస్తే చాలా వరకు ఫలితం ఉంటుంది.

### వృద్ధురాలి అదృశ్యం



వెంకమ్మ (ఫైల్)

**ముత్తుకూరు(పొదలకూరు):** మండలంలోని కృష్ణపట్నం గ్రామం, చంబసీవీధికి చెందిన బత్తల వెంకమ్మ (65) ఈనెల 11వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమైనట్టు కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు వివరాలు.. ఇంట్లో చిన్నపాటి వివాదాల వల్ల వెంకమ్మ అలిగి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ప్రిస్క్రిప్షన్ లేకుండా స్కానింగ్ చేస్తే చర్యలు



**నెల్లూరు(అర్బన్):** డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా స్కానింగ్ పరీక్షలు చేస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్ఓ సుజాత పేర్కొన్నారు. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం అమలుపై నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సలహా సంఘ సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు స్కానింగ్ పరీక్షలను రాయకూడదని చెప్పారు. స్కాన్ పరీక్షల వివరాలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని కోరారు. భ్రూణ హత్యలను జిల్లాలో అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. జిల్లా స్థాయి సలహా సంఘ చైర్‌పర్సన్ డాక్టర్ కిరణ్, అనాటమీ అసోసియేట్ ప్రొఫెసర్ స్వర్ణలతారెడ్డి, పీడియాట్రీషియన్ కరిముల్లా, డీఐఓ ఉమామహేశ్వరి, డెమో అధికారి కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

### గాయపడిన వ్యక్తి మృతి

**నెల్లూరు(క్రైమ్):** రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి (60) మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పు వైపున రోడ్డును గుర్తుతెలియని వ్యక్తి దాటుతుండగా, వాహనం ఈ నెల 11న ఢీకొని వెళ్లిపోయింది. చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఆరో వార్డు బిట్ – 2 వీఆర్వో ఆదిలక్ష్మి మంగళవారం ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు తమను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

## టైరు పగిలి అదుపుతప్పిన కారు

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** టైరు పగిలి కారు అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన పట్టణంలోని ముంబై జాతీయ రహదారిపై మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వేణు నెల్లూరు నుంచి కారులో బయల్దేరారు. ఈ క్రమంలో పట్టణ సమీపంలో టైరు పగిలిపోవడంతో డివైడర్‌ను కారు ఢీకొంది. కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతినింది. ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో పెను ప్రమాదం తప్పింది. క్షతగాత్రుడ్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై సంతోష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## నిబంధనలు పాటించకుంటే చర్యలు

**వెంకటాచలం:** ఎరువుల దుకాణాల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ కన్నయ్య హెచ్చరించారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎమ్మార్పీకి ఎరువులు విక్రయించాలని తెలియజేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ఎక్కువ ధరలకు అమ్మకాలు చేసినట్లు రైతులు తమ దృష్టికి తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయశాఖాధికారి హరి కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

## కిక్కిరిసిన పంచాయతీ బస్టాండ్

**పొదలకూరు:** వినాయకచవితి పర్వదినం సందర్భంగా పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ మంగళవారం కిక్కిరిసింది. వ్రతం నిర్వహించే వారు వినాయకుని బొమ్మలతోపాటు, పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు బస్టాండ్‌కు వచ్చారు. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. చుట్టుపక్కల గ్రామాల వారు, నగరాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తమ గ్రామాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు చేరుకోవడంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలకు తాకిడి అధికమైంది. సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంతోపాటు బందోబస్తు నిర్వహించారు.



## దళారుల నుంచి నగదు ఇప్పించండి

**తోటపల్లిగూడూరు:** ధాన్యం విక్రయాలకు సంబంధించిన నగదును దళారుల నుంచి ఇప్పించాలని తోటపల్లిగూడూరు గమళ్లపాళెం రైతులు అధికారులను వేడుకొంటున్నారు. బాధితులు మంగళవారం గ్రామంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదిన్నర క్రితం సుమారు 20 మందిమి కోవెరపాళెం గ్రామానికి చెందిన దండు వెంకటసుబ్బయ్య, దండు వెంకటేశ్వర్లు, దండు లోకేశ్ అనే దళారులకు రూ.1.40 లక్షల విలువైన ధాన్యాన్ని అమ్మినట్లు చెప్పారు. అయితే నగదు ఇవ్వలేదన్నారు. రెండు నెలల క్రితం అడిగితే నగదు ఇచ్చేంత వరకు పొలం చేసుకోవాలని 2 ఎకరాలను ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆ పొలం వద్దకు వెళ్తే దౌర్జన్యం చేసి తమపైనే అక్రమ కేసులు పెట్టారన్నారు. ధాన్యం డబ్బులు ఇవ్వకపోగా కేసులు పెట్టడం అన్యాయమన్నారు. జిల్లా అధికారులు స్పందించి దళారుల నుంచి నగదును ఇప్పించాలన్నారు. కేసులను తీసేయాలన్నారు. కార్యక్రమంలో బాధిత రైతులు రావుల సురేష్, మన్నెం కేశవయ్య, రావుల రమణయ్య, ఏపూరు రామయ్య, మన్యం జనార్దన్, మన్నెం రాధయ్య, మన్నెం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతన్నలు

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**వెంకటాచలం:** మోటార్‌బైక్ అదుపుతప్పి ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కసుమూరు సమీపంలో మంగళవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గూడూరుకు చెందిన రవికిరణ్, జాకీర్ పని నిమిత్తం బైక్‌పై కసుమూరుకు వచ్చారు. తిరిగి సొంతూరికి బయలుదేరారు. ఈ క్రమంలో కసుమూరు పంచాయతీ చింతలపాళెం వద్ద టిప్పర్ అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో రవికిరణ్, జాకీర్ గాయపడ్డారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం గూడూరుకు తరలించారు.